
గొట్లగట్టులో బురదమయంగా మారిన తుంగనగర్


గొట్లగట్టు బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక వీధి దుస్థితి


రాయవరంలో రోడ్డుపై నిలిచిన మురుగు

- డ్రెయినేజీలు లేక.. ఉన్నా పూడిక తీయకపోవడమే కారణం
- దోమలు విజృంభిస్తుండటంతో జనం బెంబేలు
- దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయని వైనం

పల్లె దారుల్లో బురద వరద

మార్కాపురం/కొనకనమిట్ల/గిద్దలూరు రూరల్: ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు పల్లెల్లో అంతర్గత రహదారుల ముఖచిత్రం మారిపోయింది. జనావాసాల ముందు మురుగు, బురద పేరుకుపోవడంతో కనీసం అడుగుతీసి అడుగువేసేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. దీనికి తోడు దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు రోగాల భయంతో బెంబేలెత్తుతున్నారు. పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కనీసం బ్లీచింగ్ కొనేందుకు కూడా పంచాయతీల్లో నిధులు లేవని కొంత కాలం క్రితం సాక్షాత్తు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించడం.. అంతలోనే పల్లెల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పడంతో విస్తుపోవడం ప్రజల వంతయింది. ఇంతకీ పంచాయతీల్లో నిధులు ఉన్నాయా అంటే సమాధానం చెప్పేవారే కరువయ్యారు.


ఛిద్రమైన గనివానిపాడు రోడ్డు

మొరపెట్టుకున్నా వినరే..!

■ మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఎస్సీ కాలనీలో రహదారులన్నీ ఛిద్రమై రాకపోకలు సాగించేందుకు అనువుగా లేకపోవడంతో కాలనీవాసులు నానాకష్టాలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరంతా రోడ్ల గుంతల్లో చేరి బురదమయంగా మారి దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువ కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్న ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు వేయాలని కోరుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాగింగ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

■ కొనకనమిట్ల మండలంలోని గనివానిపాడులో అంతర్గత రహదారులతోపాటు ఈ గ్రామం నుంచి వాగుమడుగు వెళ్లే రోడ్డు దారుణంగా తయారయ్యాయి. ఇటీవల రోజు విడిచి రోజు వర్షం పడటంతో రహదారులు చిత్తడిగా మారాయి. వాగుమడుగు-గనివానిపాడు మధ్య పొలాల్లో వరద పోటెత్తడంతో చప్టా రెండు చోట్ల కోతకు గురైంది. దారుణంగా దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఆరు నెలలుగా విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వం పైసా విదల్చలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించాలని వారు కోరుతున్నారు. గొట్లగట్టు తుంగనగర్‌లోని పలుచోట్ల మట్టి రోడ్లు, బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక వీధి బురదమయంగా మారాయి. కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడింది. వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో మురికిగా మారి దుర్వాసన వస్తోందని, దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వెంగళ్‌రెడ్డిపల్లెలో డ్రెయినేజీని తలపిస్తున్న రోడ్డు


వెంగళ్‌రెడ్డిపల్లెలో ఓ సీసీ రోడ్డు దుస్థితి ఇదీ..

■ గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు, వెంకటాపురం, వెంగళ్‌రెడ్డిపల్లె గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామంలోని సీసీ రోడ్లు సైతం మురికి కాలువల్లా దర్శనమిస్తున్నాయి. ముండ్లపాడులో పోరుమామిళ్లకు వెళ్లే ప్రధాన రహదారితో పాటుగా సినిమాహాల్ థియేటర్ వీధి ముందుభాగంలో వర్షం నీరు నిలిచింది. వెంకటాపురం గ్రామంలోనూ అంతర్గత రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ లేని కారణంగా మురుగు మొత్తం రోడ్లపైనే నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెంగళ్‌రెడ్డిపల్లె గ్రామంలోని సిమెంట్ రోడ్లు మురుగు కాలువలను తలపిస్తూ నడిచేందుకు వీల్లేని విధంగా మారాయి. దోమల ధాటికి జ్వరాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నాయి. ఇప్పటికైనా అంతర్గత రోడ్లను బాగు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

భూసార పరీక్షలతో రైతులకు మేలు


భూసార పరీక్ష నిర్వహిస్తున్న ఏఓ, సిబ్బంది

మార్కాపురం: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని భూపతిపల్లి గ్రామంలో భూసార పరీక్షలను పర్యవేక్షించారు. ఏఓ మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో మట్టి పరీక్ష చేయించుకోవడం ద్వారా పోషకాల లోపాలు తెలుస్తాయని, తద్వారా వాటిని సరిచేసుకుని పంటలు సాగుచేసుకోవచ్చన్నారు. ఈ పరీక్షలో భూమికి సంబంధించి 12 రకాల పోషకాలను పరిశీలించి నివేదక ఇస్తారని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. గ్రామ రైతు సేవా కేంద్రంలో జనుములు, జీలుగలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీఏఏ రమణి, రైతులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


కొమరోలులో యోగా సాధన చేస్తున్న అధికారులు, స్థానికులు


బేస్తవారిపేటలో యోగా సాధన చేస్తున్న అధికారులు

బేస్తవారిపేట: నిత్యం యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉండవచ్చని తహసీల్దార్ జితేంద్రకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ..

ప్రతి ఒక్కరూ యోగాను జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, ఎంఈఓ సీహెచ్ రగణారెడ్డి పాల్గొన్నారు.

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం యోగా శిక్షణ తరగతి నిర్వహించారు. ఎంపీడీఓ వీరభద్రాచారి మాట్లాడుతూ.. యోగాపై శిక్షణ పొందిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు గ్రామ స్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.కిరణ్, ఎంఈఓ మాల్యాద్రి, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యోగాపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ మస్తాన్‌వలి మాట్లాడుతూ.. యోగాసనాలతో మానసిక ప్రశాంతత దక్కుతుందన్నారు. ఈఓపీఆర్డీ బ్రహ్మయ్య, పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.


కంభంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

నేటి నుంచి లోకాభిరామస్వామి ఆలయ ధ్వజ ప్రతిష్ఠ

బేస్తవారిపేట: మండలంలోని లక్ష్మీపురంలో లోకాభిరామస్వామి ఆలయంలో ధ్వజ, కలశ, నవగ్రహ దేవతా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

29న పంచగవ్యప్రాసన, నవగ్రహ దేవతా ఆవాహన, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం, అర్చనలు, 30న ప్రతిష్ఠ మూర్తులకు అభిషేకం, నవగ్రహ మూలమంత్ర హోమాలు, 31న గర్తపూజ, యంత్రస్థాపన, విగ్రహ శిఖర కలశ, ధ్వజ ప్రతిష్ఠ, కళాన్యాసం, పూర్ణాహుతి పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంతో పాటు మండలంలోని రేషన్ డీలర్‌లు అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. బుధవారం ఉద్యోగుల విశ్రాంతి భవన్‌లో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ..

గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ జరిగేదన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల్లోనే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు అనువైన చోట రేషన్ షాపు ఏర్పాటు చేయాలని సూచించారు. నేమ్ బోర్డులు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని చెప్పారు.

ప్రమాదకరంగా చప్టా


చప్టాపై రహదారికి ఇరువైపులా దెబ్బతిన్న గోడలు

కొమరోలు: అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిపై పామూరుపల్లె సమీపంలో చప్టా ప్రమాదకరంగా మారింది. చప్టాపై రిటెయినింగ్ వాల్ దెబ్బతినడం, ఆ ప్రదేశంలో సింగిల్ రోడ్డు మాత్రమే ఉండటంతో వాహనాలు ఎదురుపడిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. చప్టా రిటెయినింగ్ వాల్స్‌ను పలుమార్లు వాహనాలు ఢీకొనడంతో క్రమంగా దెబ్బతిన్నాయి. రెండు పర్యాయాలు చప్టాపై నుంచి వాహనాలు అదుపుతప్పి బోల్తా పడ్డాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చప్టా వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి

పొదిలి: పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తామని నగర పంచాయతీ కమిషనర్ జీఎల్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు, చదును చేసే పనులను ఆయన పర్యవేక్షించారు. పెద్ద మసీదు వద్ద ఆక్రమణలు తొలగింపజేసి, జేసీబీతో చదును చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డు పక్కన సైడు కాలువలపై ఎటువంటి కట్టడాలు నిర్మించినా సహించేది లేదన్నారు. ప్రధాన రహదారి మొత్తం పూర్తయిన తర్వాత మిగిలిన రోడ్లలోనూ ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని, దుకాణదారుల బోర్డులు, పందిర్లు, షామియానాలు రోడ్డుపైకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


పెద్ద మసీదు వద్ద పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ నారాయణరెడ్డి

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలం రాయవరం గ్రామ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఒక వీఆర్వో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి రాజకీయపార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారని, టీడీపీ కార్యకర్తలతో కలిసి మీటింగ్‌కు వెళ్లిన అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ బుధవారం మార్కాపురం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం కంభం పట్టణం నుంచి టీడీపీ కార్యకర్తలతో కలిసి రాజకీయ పార్టీ కార్యక్రమానికి వీఆర్వో వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా నాగులవరం సచివాలయ ఉద్యోగి టీడీపీ కండువా మెడలో వేసుకుని ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


టీడీపీ నాయకులతో వీఆర్వో

విద్యార్థులకు కథల పోటీలు


తోటి విద్యార్థులకు కథ వినిపిస్తున్న చిన్నారి

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. చెస్, క్యారమ్స్, ఇంగ్లిష్ గ్రామర్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు స్వాతంత్ర్యోద్యమ నాయకుల జీవిత కథలు చదివి వినిపించారు. యోగా సాధనతో కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించడంతోపాటు ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం

పొదిలి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆలయ దుకాణ లీజుదారు వెలుగోలు వెంకటేశ్వర్లు, అంజమ్మ దంపతులు అన్న సంతర్పణ చేశారు. ముందుగా దాతలతో ఆలయ పూజారి మురళీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు పునుగుపాటి కోటేశ్వరరావు, అప్పల శంకరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ


స్టాకు పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదిలి: పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో 22వ నంబర్ రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ ఎం.కృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు పరిశీలించారు. సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ, వీఆర్ఓ ఉన్నారు.